క్లుప్తంగా

క్షమాగుణాన్ని కలిగి ఉండాలి



క్రీస్తు జననంపై నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తోటివారి పట్ల క్షమాగుణాన్ని కలిగి ఉండడమే క్రిస్మస్ సందేశమని సెయింట్ థెరిస్సా కళాశాల సుపీరియర్, కరస్పాండెంట్ మదర్ ఎర్నెస్టిన్ ఫెర్నాండిస్ అన్నారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఆమె క్రిస్మస్ సందేశం ఇచ్చారు. క్రిస్మస్ అంటే ప్రేమ, జాలి, దయ మొదలైనవి పంచుకునే పండుగ అని, ముఖ్యంగా ఇతరుల పట్ల క్షమాగుణాన్ని కలిగి ఉండటమే క్రిస్మస్ ఉద్దేశం అన్నారు. ప్రపంచంలో ప్రతి వారికి పుట్టినరోజు ప్రత్యేకమైనదని, ప్రపంచమంతా ఆనందంగా జరుపుకునే పుట్టినరోజు ఏసు ప్రభువుదని వివరించారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఎ.నిర్మల జ్యోత్స్న, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననంపై నాటిక, వివిధ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

26న సెలవు ప్రకటనపై వినతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 26న బాక్సింగ్ డే సందర్భంగా స్థానిక సెలవుగా ప్రకటించుకునే అవకాశం కల్పించాలని పీఆర్‌టీయూ నాయకులు డీఈఓ ఎం వెంకటలక్ష్మమ్మను కోరారు. ఈ మేరకు శనివారం ఆ సంఘ నాయకులు డీఈఓకు వినతిపత్రం అందించారు. 10వ తరగతి 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారాలతో పాటు మిగిలిన సెలవు రోజుల్లో కూడా తరగతుల నిర్వహణ పట్ల మినహాయింపును సంబంధిత రోజుల్లో కలుగజేయాలని కోరారు.

నేడు గణితంపై సదస్సు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డెమొక్రటిక్ పీఆర్‌టీయూ, ఉపాధ్యాయ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు విజయవాడ గాంధీ నగర్‌లోని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో గణితంపై సదస్సు నిర్వహించనున్నట్టు డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.శ్రీను, పి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, గణిత మేధావులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి విద్యుత్ కండక్టర్ మార్పు పనులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భీమడోలు – ఏలూరు ఫీడర్‌లో ఉన్న కండక్టర్ మార్పు పనులు ఆదివారం నుంచి జనవరి 14 వరకు నిర్వహించనున్నట్టు ఏపీ ట్రాన్స్‌కో ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఇ.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల సమయంలో పెదవేగి, ఏలూరు (వంగాయగూడెం) విద్యుత్ కేంద్రాలకు, కానుమోలు విద్యుత్ కేంద్రం నుంచి సరఫరా ఏర్పాటు చేశామని, సాంకేతిక లోపంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా జగన్ జన్మదినోత్సవం

- దివ్యాంగులు, వృద్ధుల మధ్య కేక్ కటింగ్
- పాల్గొన్న సమన్వయకర్తలు సునీల్ కుమార్, జేపీ



ఇండోర్‌స్టేడియం గేట్ వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీలు వంకా, కవురు



జగన్ జన్మదిన వేడుకలో పాల్గొన్న మహిళా కార్పొరేటర్లు, నాయకురాళ్లు



దివ్యాంగుల హోమ్‌లో చిన్నారులతో సమన్వయకర్త జయప్రకాష్, నాయకులు



ప్రేమాలయంలో పండ్లు పంచుతున్న సమన్వయకర్తలు సునీల్‌కుమార్, జేపీ

ఏలూరు టౌన్: పేదల సంక్షేమం.. అభివృద్ధికి నిరంతరం శ్రమించే రేడు.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని ఏలూరు నగరంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఏలూరు నగరంలోని దివ్యాంగుల హోమ్, ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో భోజనాలు, పండ్లు పంపిణీ చేశారు. పార్టీ ఏలూరు కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేశారు. పార్టీ ఏలూరు పార్లమెంట్, నియోజకవర్గ సమన్వయకర్తలు కారుమూరి సునీల్‌కుమార్, మామిళ్లపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా పాల్గొన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

కార్యక్రమంలో సమన్వయకర్త జయప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన అంటే ఇలా ఉండాలని చేసి చూపించి దేశానికే ఆదర్శంగా నిలిచిన ఏకైక నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. 2019 నుంచి 2024 వరకు పేదవర్గాల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ ఆయన ఎనలేని కృషి చేశారని వివరించారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు జగన్ నాంది పలికారని తెలిపారు. ఏలూరు నగరానికి తలమానికంగా ప్రభుత్వ వైద్య కళాశాలను తీసుకువచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు.

దివ్యాంగుల హోమ్‌లో..

ఏలూరు తంగెళ్లమూడి రోడ్డులోని జీఎంఎస్ దివ్యాంగుల హోమ్‌లో జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులతో పాటు సమన్వయకర్త జయప్రకాష్ కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యాంగులకు భోజనాలు స్వయంగా వడ్డించారు. అనంతరం హోమ్‌కు వీల్‌చైర్ అందజేశారు.

ప్రేమాలయంలో..

ఏలూరు మాదేపల్లి రోడ్డులోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుక ఉత్సాహంగా నిర్వహించారు. పార్టీ సమన్వయకర్తలు కారుమూరి సునీల్‌కుమార్, జయప్రకాష్ కేక్ కట్ చేశారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి దివంగత మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి ఆశయాలతో పేద, బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా గత ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక చతికిలపడిందని ఎద్దేవా చేశారు. వేలకోట్లు అప్పులు చేస్తోన్న సీఎం చంద్రబాబు ప్రజలకు మాత్రం చిల్లిగవ్వ ఇవ్వటం లేదని విమర్శించారు. వేడుకల్లో ఏలూరు మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, ఎస్సీ సెల్ కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, పల్లి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మేతర సురేష్‌బాబు, హిస్టరీ అకాడమీ మాజీ డైరెక్టర్ ఎండీ కైసర్, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, తంగెళ్ల రాము, ఇనపనూరి కేదారేశ్వరి, సుంకర చంద్రశేఖర్, పోణంగి నాయకులు సూర్యప్రకాష్, తులసీ వర్మ, గ్జేవియర్ మాస్టర్, జేసీఎస్ కన్వీనర్ వైఎస్‌వీ శివరావు, బండ్లమూడి సునీల్‌కుమార్, సొంగా మధు, దాలి వెంకటేష్, రాజేష్, బంకు వెంకట్, జయరామిరెడ్డి, ఫణి, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

సీఆర్‌ఆర్‌కు నాక్ ఏ గుర్తింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు మరో జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) తమ కళాశాలకు ఏ గ్రేడ్ గుర్తింపు ఇచ్చిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. నాక్ పరిశీలన బృందం తమ కళాశాలలో మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేసి ఏ గ్రేడ్ గుర్తింపు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికే తమ కళాశాలకు నేషనల్‌బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు ఉందని తెలిపారు. తమ కళాశాలలో అత్యుత్తమ ప్రమాణాలను భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తామని సీఆర్‌ఆర్ విద్యా సంస్థల పాలక మండలి అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్ స్పష్టం చేశారు. ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు విద్యా సంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. తమ కళాశాలను అత్యున్నత స్థాయి ప్రమాణాలతో, విద్యార్థుల అభ్యున్నతికి అవసరమైన ఆధునిక వనరులతో నిర్వహిస్తున్నట్టు కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు పేర్కొన్నారు.

రాష్ట్ర పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని డీఈఓ ఎం వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 18న ఈదర సుబ్బమ్మదేవి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో ఈదర సుబ్బమ్మదే వి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని వై.దివ్యశ్రీ ప్రథ మ (9వ తరగతి), శ్రీ శర్వాణి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థిని యు.తేజశ్రీ ప్రథమ (10వ తరగతి), వక్తృత్వంలో గార్లమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థి కె.పవన్ కుమార్ ప్రథమ (8వ తరగతి), శ్రీ శర్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని జె.భువజన పద్మశ్రీ ప్రథమ (10వ తరగతి) స్థానంలో నిలిచారని తెలిపారు. వీరు ఈ నెల 23న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

తోటివారిని ప్రేమించినప్పుడే నిజమైన క్రిస్మస్



మహిళలకు చెక్కు అందిస్తున్న బిషప్ జయరావు, ఎమ్మెల్యే చంటి



పిల్లలకు దుస్తులు అందిస్తున్న జయరావు, మైఖేల్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఒకరిని ఒకరు ప్రేమిస్తూ సహాయ సహకారాలు అందించినప్పుడే నిజమైన క్రీస్తు జన్మదినమని ఏలూరు పీఠాధిపతి, విశాఖ అగ్ర పీఠం అపోస్తుల పాలనాధికారి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. శనివారం స్థానిక గ్జేవియర్ నగర్‌లో ఏలూరు సాంఘిక సేవ కేంద్రం డైరెక్టర్ ఫాదర్ టి.ఇమ్మానుయేల్ కార్యనిర్వహణలో కరుణోదయ, మానవతా, విహాన్ స్వచ్ఛంద సేవా సంస్థలు, సెయింట్ జోన్స్ వెల్ఫేర్ సొసైటీ, సెయింట్ విన్సెంట్ డీపాల్ సొసైటీ సహచర్యంతో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఆర్టీసీ విజయవాడ జోన్ డైరెక్టర్ రెడ్డి అప్పలనాయుడు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కోల్పింగ్ ఇండియా, సోషల్ సర్వీస్ సెంటర్ సహకారంతో రూ.25 లక్షలు పేద మహిళలకు అందజేశారు. ప్రకాష్ నగర్‌లోని డీఎస్ఎఫ్ఎస్ స్పెషల్ స్కూల్ విద్యార్థులకు, వసతి గృహాల విద్యార్థులకు క్రిస్మస్ కానుకలు, విహాన్ చారిటబుల్ ట్రస్ట్ స్వచ్ఛంద సేవ సంస్థ విద్యార్థులకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనారిటీ, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారి ఎన్ శామ్యూల్ కృపావరం, జి.హేమలత, జాన్ మోషే, విజయకుమార్ కొడాలి, జి.సుధాకర్, కె.కోటేశ్వరరావు, ఫాదర్ మరియా జోజి, ఫాదర్ ఇంజే పాల్ ఫాదర్ ఐ మైఖేల్, దోమతోటి అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు సంస్కారవంతులు కావాలి

ఏలూరు రూరల్ : పిల్లలు సంస్కారవంతులుగా జీవించేందుకు కృషి చేయాలని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. అమలోద్భవి కేథడ్రిల్ ఆధ్వర్యంలో శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో ఆయన మాట్లాడారు. పిల్లలు విద్య, సంస్కారం నేర్చుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఫాదర్ మైఖేల్, వసతి గృహం సూపరింటెండెంట్ శ్రీవల్లి మాట్లాడారు. నిర్వాహకులు పిల్లలచే కేక్ కట్ చేసి, వారికి దుస్తులు అందజేశారు. ఫాదర్ ఎస్ స్టీవెన్, జక్కుల బెనర్జీ, నిర్మల యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్ పుస్తకాల పంపిణీ



మోడల్ టెస్ట్ పేపర్ పుస్తకాలను విద్యార్థినికి అందిస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నగరపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచురించిన రూ.11 వేలు విలువచేసే మోడల్ టెస్ట్ పేపర్ పుస్తకాలను పంపిణీ చేశారు. బయ్యపురెడ్డి వెంకట వరప్రసాద రెడ్డి, విశాలాక్షి (హైదరాబాద్) దంపతుల సౌజన్యంతో శనివారం టెస్ట్ పేపర్ల పుస్తకాలను గోపిమూర్తి విద్యార్థులకు అందజేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. గణిత ఉపాధ్యాయుడు ఈడే శివ శంకర రావు, ఆయన స్నేహితుడు వెంకట వర ప్రసాద రెడ్డి పదో తరగతి ఉత్తీర్ణతా శాతం పెరగడానికి టెస్ట్ పేపర్ల పుస్తకాలను ఐదేళ్లుగా ఉచితంగా పంపిణీ చేయడం ప్రశంసనీయమని గోపిమూర్తి అన్నారు. ఉపాధ్యాయ, పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని డీఎస్ ఉజ్వల, సీనియర్ ఉపాధ్యాయుడు వీకే జయకుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రుద్రాక్షి రవికుమార్ పాల్గొన్నారు.

గణిత మేధావి రామానుజన్ జయంతి



సర్టిఫికెట్లు అందుకున్న పోస్టర్ ప్రజంటేషన్ విద్యార్థులతో అధ్యాపకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ గణితం నిత్యజీవితం నుంచి విడదీయలేని ప్రాముఖ్యత కలిగినదని, మదర్ ఆఫ్ ఆల్ సైన్సెస్ అని తెలిపారు. గణిత అధ్యాపకులు పీఆర్ కావ్య శ్రీ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ మానవ రూపంలోని అద్భుతమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్ ప్రజెంటేషన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గృహహింస వ్యతిరేకతపై అవగాహన

గత నెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు నిర్వహిస్తున్న నేషనల్ జెండర్ క్యాంపెయిన్ నయా చేతన 3.0లో భాగంగా గృహహింస వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమం ప్రిన్సిపాల్ గిరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. అన్ని రంగాల్లోనూ పురుషులతో పాటు సమానంగా రాణిస్తున్న స్త్రీలను తక్కువ చేసి చూడడం తగదని గిరిబాబు అన్నారు. మహిళలపై గృహ హింస అనాగరికమన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	12
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	బిళ్లచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	26	కంద	60
కాకర కాయలు	34–44	బీట్‌రూట్	54
బీరకాయలు	30	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	30	అల్లం	70
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	48	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	48	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07
దోసకాయలు	34	పుదీనా	05
ఆనపకాయ (1)	20–25	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	36

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్-1938 నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా రెండో శనివారాలు, ఆదివారాలు, పండగ సెలవు దినాల్లో పాఠశాలలకు వచ్చేందుకు బస్సు సౌకర్యం, మధ్యాహ్న భోజన వసతి కల్పించాలని ఏపీటీఎఫ్ – 1938 జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం డీఈఓకు వినతి పత్రం అందజేశారు. పదో తరగతి విద్యార్థులకు బస్సు, మధ్యాహ్న భోజన సౌకర్యం, దూర ప్రాంతాల నుంచి వచ్చే బాలికలకు రక్షణ కల్పిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ అమలు కావడంలేదని పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 29 వరకు క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలకు క్రిస్మస్ సెలవులు ఉన్న కారణంగా ఈ నెల 26 నుంచి చేపట్టే ఎఫ్ఎల్ఎన్ శిక్షణను వాయిదా వేయాలని కోరారు. ఈ నెల 27, 28 తేదీల్లో కాంప్లెక్స్ మీటింగ్‌లను కూడా జనవరి నెలకు వాయిదా వేయాలని పేర్కొన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్–1938 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రత్నబాబు, జి.మోహన్, ఎస్‌వీ దుర్గారావు, డి.శ్రీనివాసరావు, పి.నాగరాజు ఉన్నారు.

పెట్టుబడి సాయం అమలు ఎప్పుడో?



మాట్లాడుతున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

ఉంగుటూరు: రైతులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందని ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. రైతు భరోసా పేరుతో గత ప్రభుత్వం రూ.13,500 రైతులకు అందించిందని, ఎన్నికల హామీ ప్రకారం సాగుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు కూటమి ప్రభుత్వం ఇప్పటికీ అందించలేదని నారాయణపురం ఎంపీటీసీ బండారు నాగరాజు అన్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రైతు సుఖీభవ పేరున వచ్చే ఏడాది రైతులకు ఈ పథకం అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఉంగుటూరులో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన శనివారం మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాగుపాడులో దాత అందజేసిన 25 సెంట్ల స్థలంలో ఆర్‌బీకే భవనం నిర్మిస్తే అక్కడ సమావేశం నిర్వహించకుండా, సర్పంచ్‌కి సమాచారం ఇవ్వకుండా, రైతులు సమావేశం ఏర్పాటు చేయడం ఏమిటని సర్పంచ్ కడియాల సుదీక్ష ప్రశ్నించారు. దీనిపై ఏఓ మాట్లాడుతూ పొలంబడి వ్యవసాయ క్షేత్రాల్లో నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు మాట్లాడుతూ రూ.46.68 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. మంచినీటి సమస్యలపై కంసాలిగుంట సర్పంచి మాంద్రు శాంత, కైకరం ఎంపీటీసీ చెన్ను సత్యవేణి, దొంతవరం సర్పంచి సత్యవతి ప్రశ్నించారు. వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని పంచాయతీరాజ్ ఏఈ కృష్ణమోహన్ వివరించారు. పీఆర్ ఏఈ మాట్లాడుతున్నపుడు నారాయణపురం ఎంపీటీసీ నాగరాజు మాట్లాడుతూ నారాయణపురం, చేబ్రోలు ప్రజలకు ఉపయోగపడే శ్మశాన వాటిక అభివృద్ధిపై ప్రశ్నించారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనం మంజూరు చేయాలని కోరారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ సభ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఎక్సైజ్ దాడులు

టి.నరసాపురం: మండలంలోని శనివారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. వెలగపాడు గ్రామంలో దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, బొడ్డు రమేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అదే గ్రామంలో తుట్టి వెంకటేశ్వరరావు నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని రోడ్లను రూ.1.25 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. స్థానిక ఆర్‌ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో సుమారు రూ.24 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూరి, లక్ష్మీనారాయణ చౌదరి విగ్రహాల ఆవిష్కరణ

దెందులూరు: బ్రహ్మయ్య అండ్ కో ఆడిటర్, విజయవాడ రమేష్ గుండె వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్, అక్షయపాత్ర నిర్వాహకులు మద్దిపాటి సీతారామ్మోహనరావు జన్మదిన వేడుక ఆయన స్వగ్రామమైన దెందులూరులోని అక్షయపాత్ర ఆవరణలో పలువురు విద్యా వైద్య రాజకీయ ప్రముఖుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం దివంగత మద్దిపాటి కస్తూరి, మద్దిపాటి లక్ష్మీనారాయణ చౌదరి విగ్రహాలను మద్దిపాటి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మద్దిపాటి రామ్మోహన్‌రావు, కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దివంగత మద్దిపాటి లక్ష్మీనారాయణ చౌదరి సతీమణి రాయపాటి శైలజ, సిద్ధార్థ అకాడమీ చైర్మన్ పాలడుగు లక్ష్మణరావు, సినీ హీరో రామ్ తండ్రి పోతినేని మురళి, విజయవాడ రమేష్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రమేష్ బాబు, సినీ ప్రముఖులు ఉషా పిక్చర్ అధినేత వడ్లపట్ల ఉషా బాలకృష్ణారావు, స్రవంతి మూవీస్ అధినేత రవికిషోర్, రమేష్ ఆస్పత్రి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజర్ యలవర్తి కార్తీక్ చౌదరి, పిరమిడ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజర్ ఆలూరి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణపై శిక్షణ

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం (వెంకట్రామన్నగూడెం) ఆధ్వర్యంలో జీడిమామిడి తోటల్లో సమగ్ర సస్యరక్షణపై శనివారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ప్రధాన శాస్త్రవేత్తలు ఈ.కరుణశ్రీ, విజయలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త, విస్తీర్ణ శాస్త్రవేత్త వి.దీప్తి జీడిమామిడిలో సేంద్రియ వ్యవసాయ సాగు విధానాలను గిరిజన రైతులకు వివరించారు. సమగ్ర పోషక యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, జీడిమామిడిలో నవధాన్యాల వాడకంపై మాట్లాడారు. జీడిమామిడి పూత కాలంలో చేయాల్సిన పనులను వివరించారు. మండలంలోని బండార్లగూడెంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న జీడిమామిడి తోటలను సందర్శించి చేపట్టాల్సిన యాజమాన్యాలను వివరించారు.